




జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు








| మంగళవారం 16 జూన్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 02 సంచిక : 014 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|




## మెట్రో రెండో దశ వైఫల్యం రేవంత్ రెడ్డి అసమర్థతకు నిదర్శనం: కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్, సందేశం టైమ్స్, రిపోర్టర్ శెట్టి వెంకటేష్, జూన్ 16, 2026: హైదరాబాద్ మెట్రో రైల్ రెండవ దశ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతులు దక్కకపోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఓటుకు నోటు కేసు భయం వల్లే రేవంత్ రెడ్డి కేంద్రాన్ని ప్రశ్నించలేని దయనీయ స్థితిలో ఉన్నారని, దాదాపు 71 సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా కేంద్రం ఆయనను కనీసం పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. మెట్రో రెండో దశను సాధించడంలో అట్టర్ ఫ్లాప్ అవ్వడమే కాకుండా, మొదటి దశను సైతం ఆగం చేస్తున్నందుకు రేవంత్ రెడ్డి వెంటనే ముక్కు నేలకు రాసి తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత ముమ్మాటికి కేసీఆర్‌దేనని స్పష్టం చేసిన ఆయన, ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం 28 శాతం పనులు కూడా పూర్తి చేయకుండా ప్రాజెక్టును చిక్కుల్లో వదిలేస్తే, 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే కేసీఆర్ గారు ప్రత్యేక చొరవ తీసుకుని 72 శాతం పనులను విజయవంతంగా పూర్తి చేశారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వ బెదిరింపుల వల్లే ఎల్ అండ్ టీ (L&T) సంస్థ వెళ్ళిపోయిందని, ఇప్పుడు మెట్రో రైల్ ఆస్తులను కొల్లగొట్టేందుకు పెద్ద ఎత్తున కుట్రలు జరుగుతున్నాయని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు.

## కంటోన్మెంట్‌లో రూ. 800 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలి: కలెక్టర్‌కు బీఆర్ఎస్ వినతి



హైదరాబాద్, సందేశం టైమ్స్, రిపోర్టర్ శెట్టి వెంకటేష్, జూన్ 16, 2026: కంటోన్మెంట్ పరిధిలోని తిరుమలగిరి మండలం తొకట్ట సర్వే నంబర్ 157/1లో గల 6000 ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు ఉద్దేశించిన, దాదాపు రూ. 800 కోట్ల విలువైన 8 ఎకరాల ప్రభుత్వ భూమిని తక్షణమే పరిరక్షించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిషాంక్ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలని కలిసి సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. చారిత్రాత్మకంగా "పోరంబోకు సర్కారీ" భూమిగా గుర్తించబడిన ఈ స్థలానికి సంబంధించి 1955 నాటి రికార్డులు, 1975-76 భూ ఆక్రమణ చట్టం కింద తీసుకున్న చర్యలు మరియు పలు న్యాయపరమైన విచారణలు ప్రభుత్వ హక్కులను పదేపదే సమర్థించాయని, ప్రైవేట్ వ్యక్తుల హక్కుల వాదనలను కోర్టులు, రెవెన్యూ అధికారులు పలుమార్లు తిరస్కరించారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. గత 2025లో కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే గణేష్ మరియు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సైతం ఇదే స్థలాన్ని ప్రభుత్వ భూమిగా పరిగణిస్తూ 6000 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించారని, అయితే ప్రస్తుతం ఈ భూమి అక్రమంగా ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లడమే కాకుండా చుట్టూ ప్రహరీ గోడ నిర్మించబడినట్లు సమాచారం రావడంతో స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ప్రభుత్వ హక్కులు పదేపదే నిరూపితమైనప్పటికీ ఇంతటి విలువైన ప్రజా ఆస్తి ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి ఎలా వెళ్తుందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ, ఈ భూమి హక్కులు, సరిహద్దులు, ప్రస్తుత స్వాధీన స్థితిపై రెవెన్యూ, సర్వే మరియు న్యాయ శాఖలతో సంయుక్త ధృవీకరణ జరిపి తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు.

## బడి బాట పట్టిన విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు




హైదరాబాద్, సందేశం టైమ్స్ (జూన్ 16), ప్రతినిధి: వేసవి సెలవుల అనంతరం మళ్లీ బడి బాట పట్టిన విద్యార్థులందరికీ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థినీ విద్యార్థులకు, అధ్యాపకులకు ప్రత్యేక అభినందనలు తెలిపిన ఆయన, పాఠశాల అనేది కేవలం చదువులు నేర్చుకునే స్థలం మాత్రమే కాదని, మన వ్యక్తిత్వాన్ని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్రమైన ఆలయమని పేర్కొన్నారు. ప్రతి పుస్తకం ఒక కొత్త ప్రపంచానికి తలుపు లాంటిదని, ప్రతి పాఠం ఒక కొత్త అవకాశానికి మార్గమని, విద్య మన భవిష్యత్తుకు వెలుగు నింపే అమోఘమైన శక్తి అని ఆయన అభివర్ణించారు. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు దాగి ఉందని తాను బలంగా విశ్వసిస్తానని, అందుకే అత్యున్నత ప్రమాణాలతో విద్యారంగం విలసిల్లాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపట్టిందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు అనేక చర్యలు చేపట్టామని వివరించారు. విద్యార్థులు ప్రతి రోజును సరికొత్త ఉత్సాహంతో ప్రారంభించి, గురువుల మార్గదర్శకత్వంలో జ్ఞానాన్ని సంపాదించాలని, కష్టపడి చదువుతూనే మంచి విలువలను అలవర్చుకోవాలని సీఎం సూచించారు. తమ కలలను నిజం చేసుకునేందుకు నిరంతరం శ్రమించాలని, నేటి విద్యార్థులే రేపటి భారతదేశ నిర్మాతలని ఆయన గుర్తుచేశారు. విద్యార్థులు తమలోని ప్రతిభను వెలికితీసి, కుటుంబానికి, సమాజానికి, రాష్ట్రానికి మరియు దేశానికి గర్వకారణంగా నిలవాలని పిలుపునిచ్చారు. విద్యే అన్నింటికన్నా గొప్ప సంపద అని, దానిని ఎవరూ దోచుకోలేరని, విద్యతోనే విజయం మరియు విద్యతోనే వికాసం సాధ్యమవుతాయని నొక్కిచెప్పిన రేవంత్ రెడ్డి, ఈ నూతన విద్యా సంవత్సరం విద్యార్థులందరికీ జ్ఞానం, ఆనందం, విజయాలను అందించాలని ఆకాంక్షిస్తూ, ఆనందంగా బడికి వెళ్లాలని, ఆసక్తిగా సరికొత్త విషయాలను నేర్చుకుంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని తన సందేశంలో ఆకాంక్షించారు.




## ఎల్ అండ్ టీ నుంచి మెట్రో స్వాధీనానికి ఒప్పందాలు పూర్తయినా ఐఆర్ఎఫ్‌సీ నిధులు ఎందుకు ఆపింది?: కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సందేశం టైమ్స్ (జూన్ 16) : హైదరాబాద్ మహానగరానికి అత్యంత ఆవశ్యకత కలిగిన మెట్రో విస్తరణను వేగవంతం చేసేందుకు వీలుగా, ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో మొదటి దశను స్వాధీనం చేసుకోవడానికి అన్ని రకాల ఒప్పందాలు కుదిరినప్పటికీ ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) నుంచి నిధులు ఎందుకు విడుదల కాలేదని తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ప్రశ్నించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, వాకిటి శ్రీహరి, మహమ్మద్ అజారుద్దీన్‌లతో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడానికి మరియు పెట్టుబడులను ఆకర్షించడానికి మెట్రో రైలు విస్తరణ ఎంతో అవసరమని, కేంద్ర ప్రభుత్వం నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) ఇస్తే కేంద్రం వాటా లేకుండానే వంద శాతం రాష్ట్ర ప్రభుత్వ ఈక్విటీతో రెండో దశ విస్తరణ చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో మొదటి దశను స్వాధీనం చేసుకున్న తర్వాతే రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంలో విస్తరణ చేపట్టాల్సి ఉంటుందని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకే మొదటి దశ స్వాధీనానికి అవసరమైన రూ. 13,500 కోట్ల నిధుల కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐఆర్ఎఫ్‌సీతో అన్ని రకాల ఒప్పందాలు పూర్తి చేశామని వివరించారు. ఈ రుణానికి గానూ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కూడా కౌంటర్ గ్యారెంటీ ఇచ్చిందని, జపాన్ కు చెందిన ఆర్థిక సంస్థ ద్వారా నిధులు ఇప్పటికే ఐఆర్ఎఫ్ సీ ఖాతాలో బదిలీ అయినప్పటికీ, ఒప్పందం ప్రకారం ఎల్ అండ్ టీకి చెల్లించాల్సిన నిధులను ఐఆర్ఎఫ్‌సీ నిలిపివేయడం వెనుక గల కారణమేంటని ఆయన నిలదీశారు. గతంలో ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, అప్పటి కేంద్ర మంత్రి ఎస్ జైపాల్ రెడ్డి, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి గారి కాలంలో మెట్రో మొదటి దశకు అంకురార్పణ జరిగిందని, 2009లో టెండర్లు పిలిచి 2020 నాటికి నిర్మాణం పూర్తి చేసినప్పటికీ గౌలిగూడ – ఫలక్ నుమా మార్గం పూర్తి కాలేదని గుర్తుచేశారు. మొదట్లో రూ. 15 వేల కోట్లతో ప్రారంభమైన మెట్రో అంచనా వ్యయం రూ. 22 వేల కోట్లకు చేరిందని, గత ప్రభుత్వ పదేండ్ల నిర్లక్ష్యం వల్ల దేశంలో రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ మెట్రో ప్రస్తుతం 9వ స్థానానికి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో జనాభా 1.34 కోట్లకు చేరుకున్న తరుణంలో మెట్రో విస్తరణ తప్పనిసరని, అయితే ప్రతి ఏటా రూ. 350 – 400 కోట్ల నష్టాలు వస్తున్నందున తాము రెండో దశ విస్తరణ చేపట్టలేమని ఎల్ అండ్ టీ తేల్చిచెప్పడంతో కేంద్రం సూచనల మేరకే మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించిందన్నారు. ప్రజా రవాణా సౌకర్యాల మెరుగుదల, కాలుష్య నియంత్రణే లక్ష్యంగా రూ. 30 వేల కోట్ల విలువైన మెట్రో ప్రాజెక్టును రూ. 15 వేల కోట్లకు ఎల్ అండ్ టీ నుంచి కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధమైందని, గత ప్రభుత్వాలు భారీ వడ్డీలకు రుణాలు తీసుకుంటే తాము కేవలం 4 శాతం వడ్డీకే ఐఆర్ఎఫ్‌సీ నుంచి రూ. 13,600 కోట్ల రుణ ఒప్పందం కుదుర్చుకున్నామని వివరించారు. ఇందుకోసం ఫీజు రూపేణా రూ. 84 కోట్లతో పాటు ఈక్విటీగా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 1,400 కోట్లను కూడా ఇప్పటికే చెల్లించినా నిధుల విడుదల ఆగిపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, అన్ని రాష్ట్రాల్లో మెట్రో విస్తరణకు కేంద్రం 50 శాతం నిధులు సమకూర్చుతున్నప్పుడు తెలంగాణకు ఎందుకు అన్యాయం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రివర్గంలో ఉన్న జి.కిషన్ రెడ్డి గారు దీనిపై బాధ్యత తీసుకోవాలని, హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం 50 శాతం భరిస్తున్నదన్నది వాస్తవమైతే అందుకు సంబంధించిన పత్రాలను చూపాలని, కేంద్రం భాగస్వామ్యం తీసుకోకపోతే హెచ్ఎంఆర్ఎల్ తరఫున తామే చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ సమస్యను తాము జటిలం చేయదలచుకోలేదని, ప్రజలకు మంచి జరగాలనే సంకల్పంతో సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి అవసరమైతే రాష్ట్ర ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి వివరిస్తానని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికతో ప్రజలకు మరింత చేరువైన ప్రభుత్వం: 99 రోజుల కార్యాచరణపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష





హైదరాబాద్, సందేశం టైమ్స్ (జూన్ 16), ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం మార్చి 16 నుంచి జూన్ 12 వరకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు పేర్కొన్నారు. 99 రోజుల పాటు రాష్ట్రమంతటా జరిగిన కార్యక్రమాలపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి గారు ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగాల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, వాటి ద్వారా వచ్చిన ఫలితాలను అధికారులను అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి, 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో చురుగ్గా పాల్గొన్న విభాగాలను అభినందించారు. ఈ సమావేశంలో రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్ గారితో పాటు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొని, ఆయా విభాగాలు జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు చేపట్టిన కార్యక్రమాల వివరాలపై నివేదికలను సమర్పించారు. ప్రధాన కార్యదర్శుల నుంచి జిల్లా కలెక్టర్ వరకు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతినెలా క్షేత్రస్థాయికి వెళ్లాలని గతంలో ఆదేశించిన విషయాన్ని గుర్తు చేసిన సీఎం, క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లని అధికారులు, జిల్లా కలెక్టర్లపై తనకు ప్రత్యేక నివేదిక ఇవ్వాలని చీఫ్ సెక్రటరీని ఆదేశించారు. వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ ను తప్పనిసరిగా నమోదు చేయాలని, గ్రామాల్లో వ్యక్తమైన సమస్యలను కూడా ఆయా శాఖలు తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ మూడు నెలల కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, చేసిన శంకుస్థాపనలు, ఆస్తుల వివరాలన్నీ పక్కాగా నమోదు చేయాలని చెప్పారు. ఇప్పటికీ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాలుంటే.. వెంటనే ఆ జాబితాను సిద్ధం చేయాలని, అక్కడ కొత్తగా గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలను చేపట్టేందుకు వీలుగా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని చెబుతూ, విద్యా, వైద్య విభాగాల్లో అన్ని స్థాయిల్లో ఫేషియల్ రికగ్నిషన్ విధానం అమలు చేయాలని స్పష్టం చేశారు. పాఠశాలల నుంచి కాలేజీల వరకు, పీహెచ్‌సీల నుంచి ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల వరకు ఉద్యోగులందరికీ ఇదే అటెండన్స్ విధానం పాటించాలన్నారు. రాష్ట్రస్థాయిలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష నిర్వహించినట్లే, జిల్లాల వారీగా వెంటనే సమీక్షలు జరపాలని, ఈ సమీక్షల పర్యవేక్షణకు రాష్ట్ర స్థాయి నుంచి ప్రతి జిల్లాకో సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించి పంపించాలని చెప్పారు. జిల్లాల వారీగా ఈ ప్రగతి నివేదికలను విడుదల చేయడంతో పాటు నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, లబ్ధిదారులు, ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు సిద్ధం చేసి వాటిని అధికారిక డ్యాష్ బోర్డులో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. తాను ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత జిల్లాల పర్యటనలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై అధికారులను ఆరా తీస్తూ, నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి హామీల పురోగతిపై త్వరితగతిన సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రణాళికా విభాగాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## ఘనంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు: చింతకానిలో రక్తదాన శిబిరం, అన్నదానం





చింతకాని, సందేశం టైమ్స్ (జూన్ 16), ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆశ్రయ సేవా సొసైటీ సహకారంతో మండల కేంద్రంలో సోమవారం జన్మదిన వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా తలసేమియా బారిన పడిన పిల్లల కోసం ప్రత్యేక రక్తదాన శిబిరంతో పాటు ఉచిత కంటి వైద్య పరీక్షలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుడా (SUDA) చైర్మన్ పువ్వాళ దుర్గప్రసాద్, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి యాదవ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కంచమర్తి రామకృష్ణ నేతృత్వంలో జరిగిన ఈ రక్తదాన శిబిరంలో యువత, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథులు, నాయకులు మాట్లాడుతూ, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం ద్వారా పునర్జన్మ ప్రసాదించవచ్చని, సమాజానికి ఉపయోగపడే ఇటువంటి సేవా కార్యక్రమాల్లో యువత చురుగ్గా పాల్గొనడం అభినందనీయమని కొనియాడారు. రాష్ట్రంలో మహిళలు, యువత, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారి నాయకత్వం ఆదర్శప్రాయమైనదని ప్రశంసించారు. అనంతరం భట్టి విక్రమార్క గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆవుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మంది ప్రజలకు ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ నాయకులు, జోన్ ఇంచార్జీలు, సొసైటీ డైరెక్టర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య శ్రేణులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం: ప్రజావాణిలో 82 దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్





మెదక్, సందేశం టైమ్స్ (జూన్ 16), మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యమని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) భవనంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఆమె 82 దరఖాస్తులను స్వీకరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించడానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్‌మెంట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు అందజేసిన దరఖాస్తులను ఏమాత్రం జాప్యం చేయకుండా సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించాలని, వచ్చే సోమవారం నాటికి అందిన ప్రతి దరఖాస్తును ఖచ్చితంగా పరిష్కరించాలని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, దరఖాస్తుదారునికి రశీదు అందజేయడం ద్వారా సమస్యల పరిష్కారంలో పూర్తి పారదర్శకత నెలకొల్పాలని సూచించారు. అదేవిధంగా, దరఖాస్తులపై ఆయా శాఖల అధికారులు తీసుకున్న చర్యల వివరాలను కూడా పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని, నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించేలా చూడాలని, ఒకవేళ పరిష్కారంలో నిర్లక్ష్యం వహించి ఆలస్యం చేస్తే గనుక సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) అంబదాస్ రాజేశ్వర్‌లతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వనాలే పర్యావరణ పరిరక్షణకు వరాలు.. జిల్లాలో 31.95 లక్షల మొక్కల లక్ష్యంతో వనమహోత్సవం: జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్





మెదక్, సందేశం టైమ్స్ (జూన్ 16), మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: వనాలు పర్యావరణ పరిరక్షణకు వరాలని, మొక్కలు నాటడాన్ని ఒక సామాజిక బాధ్యతగా తీసుకొని ఈనెల 18వ తేదీ నుండి వన మహోత్సవ కార్యక్రమాన్ని జిల్లాలో పండుగ వాతావరణంలో నిర్వహించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అటవీ అధికారి జోజి, జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ మరియు వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి వనమహోత్సవ ఏర్పాట్లు, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, ఆస్తి పన్ను వసూలు, ప్రభుత్వ కార్యాలయాల పరిశుభ్రతపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని తమ భాగస్వామ్యం ద్వారా విజయవంతం చేసిన జిల్లా అధికారులందరికీ ధన్యవాదాలు తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి, పచ్చదనాన్ని పెంపొందించడానికి వన మహోత్సవం ఎంతగానో దోహదపడుతుందని, ఈనెల 18న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నేపథ్యంలో మన జిల్లాలో కూడా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో గల నగర్ వన్ యోజన పార్కులో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు వివరించారు. అటవీ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మున్సిపల్, వ్యవసాయ, విద్యా మరియు వివిధ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 31.95 లక్షల మొక్కలను నాటేందుకు తగు చర్యలు తీసుకోవాలని, దీనిని ఒక ప్రజా ఉద్యమంగా మార్చి ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై శాఖల వారీగా సమీక్ష జరిపిన కలెక్టర్, వాటిని త్వరితగతిన పరిష్కరించడంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. ఆస్తి పన్ను వసూళ్లలో భాగంగా కలెక్టరేట్ నిర్వహణ కమిటీల ద్వారా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలు పరిశుభ్రతకు నిలయాలుగా మారాలని, తన ఆకస్మిక తనిఖీలలో ఏ కార్యాలయమైనా అపరిశుభ్రంగా కనిపిస్తే సంబంధిత అధికారులపై కఠిన క్రమశిక్షణా చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమాసింగ్ హెచ్చరించారు.



## సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్: చౌటకూర్ లో తాపీ మేస్త్రీల సమావేశం, ఉచిత ప్రమాద బీమా పత్రాల పంపిణీ

చౌటకూర్, సందేశం టైమ్స్ (జూన్ 16), మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా వికాట్ గ్రూపుకి చెందిన భారతి సిమెంట్ అద్భుతంగా ఎదుగుతున్నదని, వికాట్ గ్రూప్ కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా 12 దేశాలలో విస్తరించి ఉన్నాయని ఆ సంస్థ టెక్నికల్ ఆఫీసర్ శ్రీధర్ తెలియజేశారు. చౌటకూర్ లోని శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మార్కెట్ లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని, ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు మరియు రహదారుల నిర్మాణానికి ఇది అత్యంత సరైన ఎంపిక అని ఆయన పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాల దృష్ట్యా మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ ధర 20 రూపాయలు అధికంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా భారతి సిమెంట్ డీలర్ అభిలాష్ గారు మాట్లాడుతూ, భారతి సిమెంట్ సర్వీస్ చాలా వేగంగా ఉంటుందని, మార్కెట్లో దీనికి అత్యధిక డిమాండ్ ఉండి భారీగా సేల్స్ అవుతున్నాయని తెలియజేశారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రీట్ వేసే సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు నేరుగా నిర్మాణ సైట్ వద్దకే వచ్చి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారని వివరించడంతో పాటు ఇంటి నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం ఈ సమావేశంలో పాల్గొన్న తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయల విలువైన ఉచిత ప్రమాద బీమా పత్రాలను ఆ సంస్థ టెక్నికల్ ఆఫీసర్ శ్రీధర్ మరియు డీలర్ అభిలాష్ గారు చేతులమీదుగా ఘనంగా అందజేశారు. ఈ కార్యక్రమ సమీక్షా సమావేశంలో భారతి సిమెంట్ డీలర్ అభిలాష్ తో పాటు సుమారు 50 మంది తాపీ మేస్త్రీలు, నిర్మాణ రంగ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: కంది మండలం మామిడిపల్లిలో బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవం




సంగారెడ్డి, సందేశం టైమ్స్ (జూన్ 16), మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కంది మండలం మామిడిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)లో బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ అధికారి యాదయ్య గారు మాట్లాడుతూ, మైనర్ పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమని, ఒకవేళ పిల్లలతో పనులు చేయిస్తే గనుక యజమానులపై కఠిన చట్టపరమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. పిల్లలకు అద్భుతమైన భవిష్యత్తు ఉందని, వారు ఎక్కడా కూడా పనుల్లో చేరకుండా నిరంతరం చదువుకుంటూ సమాజంలో ఒక ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా 6 నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలందరూ ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత నిర్బంధ విద్యను తప్పనిసరిగా అభ్యసించాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా బాలల సంరక్షణ అధికారి (డిసిపియు) రత్నం గారు మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లాలో బాలల రక్షణ కోసం రౌండ్ ది క్లాక్ అందుబాటులో ఉన్న చైల్డ్ వెల్ఫేర్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 గురించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సుదీర్ఘంగా వివరించారు. జిల్లాలో ఎక్కడైనా పిల్లలు ఏ విధమైన ఆపదలో ఉన్నా, లేదా బాలకార్మికులుగా పనులు చేస్తూ కనిపించినా వెంటనే 1098 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. పిల్లలు పనులకు వెళ్లకుండా చక్కగా చదువుకుంటేనే వారి జీవితాలకు మంచి భవిష్యత్తు ఉంటుందని, తద్వారా సమాజంలో మంచి పొజిషన్‌లో నిలబడతారని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత మేడమ్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను బడికి పంపించి చదివించాలని, మైనర్ పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ పనులకు పంపవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సఖి సెంటర్ ప్రతినిధి కల్పన, చైల్డ్ వెల్ఫేర్ కో-ఆర్డినేటర్ యాదగిరి, స్కోప్ (SCOPE) సంస్థ యాజమాన్యం శివశంకర్, సవిత, సావిత్రి, మరియు రామగౌడ్‌లతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో మెరిసిన మెదక్ క్రీడాకారులు: అభినందించిన జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్



మెదక్, సందేశం టైమ్స్ (జూన్ 16), మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఈనెల 11, 12 తేదీలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 12వ తెలంగాణ పురుషుల మరియు మహిళల అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలలో మెదక్ జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచి వివిధ క్రీడాంశాలలో పతకాలు సాధించారు. పతకాలు సాధించి జిల్లాకు విచ్చేసిన క్రీడాకారులను మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ గారు ప్రత్యేకంగా అభినందించి, వారు సాధించిన పతకాలను వారి మెడలో వేసి ఘనంగా సత్కరించారు. ఈ పోటీలలో అథ్లెటిక్స్ విభాగంలో అనిత 10 కిలోమీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించగా, శేఖర్ 3000 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం మరియు 400 మీటర్ల హర్డిల్స్ విభాగంలో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు, అలాగే అశోక్ మరియు రవి 4×400 రిలే విభాగంలో ద్వితీయ స్థానాన్ని దక్కించుకొని జిల్లా కీర్తిని చాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ, క్రీడాకారులు క్రీడలలో కష్టపడి రాణించి జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయికి ఎదిగి మెదక్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి రమేష్ గంగాల, అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనుముల మధుసూదన్, మరియు కోచ్ అర్జున్‌లతో పాటు పలువురు క్రీడా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మంచిర్యాల తాండాలో సహారా మెగా మెడికల్ క్యాంప్: ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్న ప్రజలు





సంగారెడ్డి, సందేశం టైమ్స్ (జూన్ 16), అందోల్ టౌన్ ప్రతినిధి బి రమేష్ బాబు: సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గంలోని వట్‌పల్లి మండలం మంచిర్యాల తాండాలో గ్రామ సర్పంచ్ రామావత్ జ్యోతి మోహన్ గారి ఆధ్వర్యంలో, సహారా హెల్త్ డెవలప్‌మెంట్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి గారి సహకారంతో భారీ మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ దామోదర్ రాజనర్సింహ గారి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో తాండా ప్రజలకు ఉచితంగా వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య సేవలను అందుకున్న తాండా ప్రజలు మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి, సర్పంచ్ జ్యోతి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పేద ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసే కష్టాలు ఈ క్యాంప్ ద్వారా తప్పాయని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఆరోగ్యమే మహాభాగ్యమని గ్రహించి ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలకు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు మాట్లాడుతూ, కేవలం మనం ఒక్కరమే ఆరోగ్యంగా ఉండడం కాకుండా సమాజమంతా ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ దోహదపడాలని పిలుపునిచ్చారు. ఈ మెగా వైద్య శిబిరంలో వట్‌పల్లి సర్పంచ్ రవీందర్, వీరారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు చిన్నపట్ల వినయ్ గౌడ్, వెంకట్ పాటిల్, శంకరప్ప, శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్ మరియు తాండా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఖదీరాబాద్‌లో అక్రమ చేపల చెరువుల కూల్చివేత: ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారుల కఠిన చర్యలు




వట్‌పల్లి, సందేశం టైమ్స్ (జూన్ 16), ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలంలోని ఖదీరాబాద్ గ్రామ పరిధిలో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఏర్పాటు చేసిన అక్రమ చేపల చెరువులపై రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు సంయుక్తంగా కఠిన చర్యలు చేపట్టారు. గ్రామ శివారులోని సర్వే నంబర్లు 930, 931, 928లలో ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఆరు అక్రమ చేపల చెరువులను జేసీబీల సహాయంతో అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రభుత్వ భూములు, చెరువులు, కాలువలు మరియు నీటి వనరులను ఆక్రమించి చేపట్టే అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాల గుర్తింపు, తొలగింపు కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కూల్చివేత కార్యక్రమంలో తహసీల్దార్ జంగేశ్వర్, నీటిపారుదల శాఖ ఏఈ రోహిత్, పోలీసు అధికారులు మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొని, శాంతిభద్రతల నడుమ ఈ చర్యలను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు సహజ వనరుల సంరక్షణకు ప్రజలంతా పూర్తి స్థాయిలో సహకరించాలని అధికారులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## ప్రజావాణిలో ప్రజా సమస్యలు విన్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్: ఫిర్యాదులపై నిష్పక్షపాత విచారణకు ఆదేశాలు





సంగారెడ్డి, సందేశం టైమ్స్ (జూన్ 16), ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ గారు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో ఓపికగా మాట్లాడి సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్న ఎస్పీ, సంబంధిత అంశాలపై స్థానిక పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి పూర్తి సమాచారాన్ని సేకరించారు. ప్రతి ఫిర్యాదుపై ఎలాంటి పక్షపాతం లేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వరమే న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను స్పష్టంగా ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎవరూ కూడా మధ్యవర్తులను నమ్మి మోసపోకుండా, తమ సమస్యలను నేరుగా పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రజావాణి వేదిక ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును జిల్లా పోలీసు కార్యాలయం నుండి నిరంతరం పర్యవేక్షిస్తూ, బాధితులకు త్వరితగతిన, అత్యంత పారదర్శకంగా న్యాయం అందించడమే పోలీసు శాఖ యొక్క ముఖ్య లక్ష్యమని ఎస్పీ పరితోష్ పంకజ్ స్పష్టం చేశారు.

## ప్రతి పోలీస్ స్టేషన్‌కు 'పోలీస్ మెంటార్' వ్యవస్థ: మహిళల భద్రతకు 'స్పందన' సేవలు ప్రారంభించిన సీపీ సజ్జనార్



హైదరాబాద్, సందేశం టైమ్స్ (జూన్ 16), ప్రతినిధి: హైదరాబాద్ మహానగరంలో ప్రజా భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. పౌరుల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కానిస్టేబుల్‌ను 'పోలీస్ మెంటార్'గా నియమించే సరికొత్త వ్యవస్థను అమలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. మహిళలు తమ సమస్యలను ఎలాంటి భయాందోళనలు లేకుండా పోలీసులకు తెలియజేయడానికి "స్పందన - ఆల్ ఉమెన్ ఫస్ట్ రెస్పాండర్ సిస్టమ్"ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ నూతన సంస్కరణల ద్వారా ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, త్వరితగతిన మరియు వేగవంతమైన సేవలు అందించడమే తమ పోలీస్ శాఖ యొక్క ముఖ్య లక్ష్యమని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు.

## భూ సమస్యపై సెల్ టవర్ ఎక్కి రైతు నిరసన: రామాయంపేట మండలం అక్కన్నపేటలో కలకలం



రామాయంపేట, సందేశం టైమ్స్ (జూన్ 16), మెదక్ జిల్లా ఇంచార్జి అనిల్ కుమార్: మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో భూ సమస్య విషయమై ఓ రైతు సెల్ టవర్ ఎక్కి వినూత్నంగా నిరసన తెలపడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామానికి చెందిన పోలీస్ శ్రీనివాస్ అనే రైతు తనకు చెందిన భూమి విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అధికారులు స్పందించి తనకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సెల్ టవర్ పైకి ఎక్కాడు. తనకు న్యాయం జరగని పక్షంలో పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటానని ఆయన హెచ్చరించడంతో అక్కన్నపేట గ్రామంలో కొంతసేపు తీవ్ర ఉద్రిక్తత, ఆందోళనకర వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. సెల్ టవర్ పై ఉన్న రైతు శ్రీనివాస్‌తో అధికారులు ఓపికగా మాట్లాడి, ఆయన ఎదుర్కొంటున్న భూ సమస్యను పూర్తిగా పరిశీలించి త్వరితగతిన తగిన న్యాయం చేస్తామని గట్టి హామీ ఇచ్చారు. అధికారుల నుంచి స్పష్టమైన భరోసా లభించడంతో శాంతించిన రైతు శ్రీనివాస్ సురక్షితంగా సెల్ టవర్ దిగి కిందకు రావడంతో అధికారులు, గ్రామస్తులు అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## మెదక్ జిల్లాలో విద్యార్థులకు అందని ప్రభుత్వ బ్రేక్ ఫాస్ట్ పథకం: మధ్యాహ్న భోజనానికే పరిమితం



మెదక్, సందేశం టైమ్స్ (జూన్ 16), మెదక్ జిల్లా ఇంచార్జి అనిల్ కుమార్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు మరియు కళాశాలల విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ఉదయం అల్పాహారం (బ్రేక్ ఫాస్ట్) పథకం మెదక్ జిల్లాలో ఇంకా అమలుకు నోచుకోలేదు. దీనివల్ల జిల్లావ్యాప్తంగా ఉన్న 1,269 ప్రభుత్వ పాఠశాలలు మరియు 33 జూనియర్ కళాశాలల్లో చదువుతున్న వేలాది మంది విద్యార్థులు ఈ పథకం యొక్క ప్రయోజనాలకు పూర్తిగా దూరంగా ఉన్నారు. ప్రస్తుతం వీరికి కేవలం మధ్యాహ్న భోజన సదుపాయం మాత్రమే అందుతోంది. ఈ పథకంలో భాగంగా విద్యార్థులకు దోశ, మిల్లెట్ ఇడ్లీ, పూరీ, బోండా, ఉప్మా వంటి విభిన్న రకాల పోషకవిలువలు గల అల్పాహారాలను అందించనున్నట్లు ప్రభుత్వం గతంలో ప్రకటించినప్పటికీ, జిల్లాలో క్షేత్రస్థాయిలో మాత్రం ఇది ఇంకా ప్రారంభం కాకపోవడం గమనార్హం. పేద విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని మెదక్ జిల్లాలో కూడా తక్షణమే ప్రారంభించి, నిరంతరాయంగా అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు మరియు ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జహీరాబాద్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా

హైదరాబాద్, సందేశం టైమ్స్ (జూన్ 16), ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ప్రజా భవన్ నివాసంలో జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి అస్మా ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక కేక్ కటింగ్ కార్యక్రమంలో ఆమె పాల్గొని, పార్టీ శ్రేణులు మరియు శ్రేయోభిలాషుల తరపున ఉప ముఖ్యమంత్రికి అభినందనలు అందజేశారు. ప్రజాసేవ పట్ల భట్టి విక్రమార్క గారికి ఉన్న అంకితభావాన్ని, నిరంతర శ్రమను ఈ సందర్భంగా ప్రశంసించిన అస్మా గారు, ఆయన నిండు నూరేళ్లు సంపూర్ణ ఆరోగ్యంతో, ఆనందోత్సాహాలతో జీవించాలని, ప్రజా సంక్షేమ రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ మర్యాదపూర్వక శుభాకాంక్షల కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మహిళా ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

## రూ.2.70 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు: మెదక్ పట్టణ రూపురేఖలు మార్చడమే లక్ష్యం







మెదక్, సందేశం టైమ్స్ (జూన్ 16), మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: మెదక్ పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్ది, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా మెదక్ శాసనసభ్యులు డా. మైనంపల్లి రోహిత్ రావు సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో మొత్తం రూ.2 కోట్ల 70 లక్షల 50 వేల రూపాయల భారీ అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారులు, సీసీ డ్రెయిన్లు, స్లాబులు, తాగునీటి సదుపాయాల కల్పన వంటి కీలక పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 10వ వార్డులో రూ.21 లక్షల వ్యయంతో ఎండి అత్తర్ షరీఫ్ నుండి జియావుద్దీన్, తిరుపతి ఇంటి వరకు, బస్తీ దవాఖానా నుండి గౌడ నాగులు, బండి నర్సింలు ఇంటి వరకు సీసీ రోడ్ల పనులను, 27వ వార్డులో రూ.35 లక్షలతో వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. అలాగే 11వ... వార్డులోని సాయినగర్ కాలనీ, వెంకట్రావు నగర్ కాలనీ, రషీద్ కాలనీలలో రూ.52 లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్లు, స్లాబులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. మెదక్ అభివృద్ధి చరిత్రలో మరో మైలురాయిగా 13వ వార్డు, నల్లపోచమ్మ కాలనీ, మీరా కాలనీలలో రూ.1 కోటి 6 లక్షల భారీ వ్యయంతో సీసీ డ్రెయిన్లు, స్లాబులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వీటితో పాటు 14వ వార్డులో శ్రీ గట్టమ్మ గుడి పరిసర ప్రాంతాల్లో రూ.9 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులను, 24వ వార్డులో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టే పనులను ప్రారంభించారు. 15వ వార్డులో ఖైరత్ అలీ ఇంటి నుండి ఖైసర్ పాషా ఇంటి వరకు, హైదర్ ఇంటి నుండి రజక సంఘం వరకు, రహమత్ ఇంటి నుండి రామవ్వ ఇంటి వరకు వివిధ ప్రాంతాల్లో రూ.17.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అదేవిధంగా పట్టణంలోని 3వ వార్డులో మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (ఎమ్మెస్సార్వో) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు తాగునీటి బోరు మోటార్లను ఎమ్మెల్యే ప్రారంభించి తాగునీటి సమస్యకు చెక్ పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం కోసం ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థను, నాణ్యమైన రోడ్డు వసతులను కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## పోసానిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కుల పంపిణీ

పోసానిపేట, సందేశం టైమ్స్ (జూన్ 16), అందోల్ మండల ప్రతినిధి: అందోల్ మండల పరిధిలోని పోసానిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు మరియు నోటుబుక్కులను ఘనంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గ్రామ సర్పంచ్ శ్రీ గోపాల్, ఉపసర్పంచ్ శ్రీ రాములు, స్థానిక వార్డు సభ్యులు మరియు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీమతి రజిత గారు సంయుక్తంగా తమ చేతుల మీదుగా పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులంతా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు మరియు మౌలిక వసతులను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకుని చదువులో మరింతగా రాణించాలని కోరారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పుస్తకాలు అందడం వల్ల విద్యార్థులకు చదువుపై మరింత ఆసక్తి పెరుగుతుందని, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ కృష్ణయ్య, ఉపాధ్యాయులు రాజేశ్వరి, మహేష్, శివకుమార్, అనితలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యా కమిటీ ప్రతినిధులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వర్షాకాల వ్యాధులపై అప్రమత్తం: ప్రభుత్వ ఆసుపత్రులు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలి – మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్, సందేశం టైమ్స్ (జూన్ 16), ప్రతినిధి: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల నివారణ, ప్రభుత్వ ఆసుపత్రుల సంసిద్ధత, ప్రజారోగ్య పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం హైదరాబాద్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, డయేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల ప్రస్తుత పరిస్థితి, జిల్లాల వారీ కేసులు, ప్రభుత్వ ఆసుపత్రుల సిద్ధత, మందులు, నిర్ధారణ కిట్లు, దోమల నివారణ చర్యలు, ఫీవర్ సర్వేలు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలపై పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్ మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని, వ్యాధులు ప్రబలిన తర్వాత చికిత్స కంటే ముందస్తుగా అరికట్టడమే ఆరోగ్యశాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో పనిచేస్తూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ ఆసుపత్రి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని, మందులు, రోగ నిర్ధారణ కిట్లు, ఓఆర్ఎస్, ప్లేట్‌లెట్లు, వైద్య సిబ్బంది, అత్యవసర సేవల్లో ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వరం లేదా ఇతర సీజనల్ వ్యాధుల లక్షణాలతో వచ్చే ప్రతి ఒక్కరికీ వెంటనే పరీక్షలు నిర్వహించి తక్షణ చికిత్స అందించాలని, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో దోమల నివారణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని, ప్రతి శుక్రవారం నిర్వహించే 'డ్రై డే' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. నిల్వ నీటి తొలగింపు, లార్వా నిర్మూలన, ఫాగింగ్, ప్రత్యేక ఫీవర్ సర్వేలు నిరంతరం కొనసాగించాలని, గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, హాస్టళ్లు, నిర్మాణ ప్రాంతాలు వంటి అధిక ప్రమాద ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా మున్సిపల్, పంచాయతీరాజ్, విద్య, మహిళా శిశు సంక్షేమం, రెవెన్యూ శాఖలతో సమన్వయాన్ని బలోపేతం చేసి పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీటి భద్రత, క్షేత్రస్థాయి పర్యవేక్షణను వేగవంతం చేయాలని, ప్రతి జిల్లాలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు పూర్తిస్థాయిలో పనిచేసి ఎక్కడైనా వ్యాధుల క్లస్టర్లు గుర్తించిన వెంటనే స్పందించాలని సూచించారు. ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరం లేదా ఇతర లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని విజ్ఞప్తి చేసిన ఈ సమీక్షా సమావేశంలో మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, జీహెచ్ఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమర్‌సింగ్ నాయక్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## కొల్చారం మండలంలో విద్యుత్ షాక్‌తో రైతు దుర్మరణం: వరిగుంటం గ్రామంలో విషాదఛాయలు





కొల్చారం, సందేశం టైమ్స్ (జూన్ 16), కొల్చారం మండల ప్రతినిధి: మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని వరిగుంటం గ్రామంలో సోమవారం ఒక ఘోరమైన విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు కురుమ పోచయ్య తన వ్యవసాయ పనుల నిమిత్తం ఉదయాన్నే పొలానికి వెళ్లి వరి పంటను పరిశీలిస్తుండగా, అక్కడ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించి ప్రాథమిక వివరాలు సేకరించిన అనంతరం కేసు నమోదు చేశారు. ఈ ఊహించని ఘోర దురంతంతో వరిగుంటం గ్రామంలో ఒక్కసారిగా తీవ్ర విషాదఛాయలు అలుముకోగా, రైతు పోచయ్య అకాల మృతి పట్ల గ్రామస్థులు, తోటి రైతులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోచయ్య అకాల మరణాన్ని తట్టుకోలేక ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న వాతావరణం అక్కడ ఉన్న ప్రతి ఒక్కరినీ ఎంతగానో కదిలించివేసింది. ఈ ప్రమాద ఘటనపై పోలీసులు పూర్తి స్థాయి దర్యాప్తును వేగవంతం చేశారు.



## పోతిరెడ్డిపల్లిలో అక్రమ మద్యం విక్రయాల నిషేధానికి గ్రామస్తుల డిమాండ్: ఎస్సై పాండుకు వినతిపత్రం అందజేత

అందోల్, సందేశం టైమ్స్ (జూన్ 16), ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో గత కొంతకాలంగా మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని, దీనివల్ల గ్రామంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు తీవ్ర ఆరోపణలు వ్యక్తంచేశారు. ముఖ్యంగా స్థానిక పాఠశాల సమీపంలోనే మద్యం దుకాణాలు ఉండటంతో, మద్యం సేవించిన కొందరు వ్యక్తులు అక్కడ అసభ్యంగా ప్రవర్తిస్తూ న్యూసెన్స్ సృష్టిస్తున్నారని, దీనివల్ల పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, మహిళలు మరియు గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విచ్చలవిడి మద్యం అమ్మకాల వ్యవహారంపై గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి గారు వెంటనే స్పందించి, వార్డు సభ్యులు మరియు గ్రామ పెద్దలతో అత్యవసరంగా చర్చించి గ్రామసభలో ఈ సమస్యను ప్రధానంగా ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులందరి ఏకోన అభిప్రాయం మరియు ఆమోదంతో పోతిరెడ్డిపల్లి గ్రామంలో మద్యపానాన్ని పూర్తిగా నిషేధించాలని గట్టిగా నిర్ణయించారు. ఈ మేరకు సర్పంచ్ విజయలక్ష్మి, ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యులు అందరూ కలిసి స్థానిక ఎస్సై పాండు గారిని మర్యాదపూర్వకంగా కలుసుకుని ఒక వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో శాంతిభద్రతలను కాపాడటంతో పాటు, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అక్రమ మద్యం విక్రయాలు జరిపే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మద్యం అమ్మకాల దుకాణాలను తక్షణమే మూసివేయించాలని ఈ సందర్భంగా వారు పోలీసు అధికారులను గట్టిగా కోరారు.

## నిర్దేశించిన గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయండి: అధికారులతో సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆదేశం



పటాన్చెరు, సందేశం టైమ్స్ (జూన్ 16), బి డేవిడ్: పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్ల పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని తన క్యాంపు కార్యాలయంలో అమీన్పూర్, పటాన్చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులపై ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు సర్కిళ్ల పరిధిలోని 9 డివిజన్లలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులు ఎమ్మెల్యేకు సమగ్రంగా వివరించగా, ప్రధానంగా నూతన కాలనీలలో శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనులను పరిశీలించాలని, ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున పారిశుధ్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు చెత్తను తరలించడంతోపాటు ప్రతి వీధిని పరిశుభ్రంగా ఉంచాలని, అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదే క్రమంలో బొల్లారం స్టేడియం, పాటి వివేకానంద స్టేడియంల అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలపగా, రెండు సర్కిళ్లకు సంబంధించిన 250 కోట్ల నిధులను తిరిగి డివిజన్లలో చేపట్టబోయే అభివృద్ధి పనులకే కేటాయించాలని ఇప్పటికే సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించడం జరిగిందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు ప్రదీప్ కుమార్, జ్యోతి రెడ్డి, డిఈ వెంకటరమణ, ఏఈలు ఫైజాన్, లావణ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

## నెల్లూరు జిల్లాలో ఘోర విషాదం: ఒకే ఇంట్లో ఉరివేసుకుని ముగ్గురు ఆత్మహత్య




సంగం, సందేశం టైమ్స్ (జూన్ 16), ప్రతినిధి: నెల్లూరు జిల్లా సంగం మండల పరిధిలోని దువ్వూరు గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. రిటైర్డ్ ఉపాధ్యాయుడు మధు, ఆయన కుటుంబ సభ్యులతో కలిపి మొత్తం ముగ్గురు ఒకే ఇంట్లో ఆత్మహత్య చేసుకోవడంతో దువ్వూరు గ్రామంలో ఒక్కసారిగా తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికుల కథనం ప్రకారం, రిటైర్డ్ టీచర్ మధు కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం ఎంతకీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన పొరుగువారు ఇంట్లోకి వెళ్లి చూడగా, లోపల ముగ్గురూ ఉరివేసుకుని ప్రాణాలు కోల్పోయి ఉండటాన్ని గమనించి తీవ్ర దిగ్భ్రాంతికి గురై వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు చేరవేశారు. రిటైర్డ్ టీచర్ మధు అందరితో ఎంతో సౌమ్యంగా ఉండేవారని, అలాంటి కుటుంబం ఇలాంటి ఘోర నిర్ణయం తీసుకోవడంపై గ్రామస్తులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే సంగం పోలీసులు క్షేత్రస్థాయికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను ఆసుపత్రికి తరలించి, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అసలు ఈ ముగ్గురి ఆత్మహత్యకు గల కారణాలు ఆర్థిక ఇబ్బందులా, కుటుంబ కలహాలా లేక మరేదైనా బలమైన కారణం ఉందా అనే కోణంలో పోలీసులు విచారణను ముమ్మరం చేశారు.

## మానవత్వమే మా మతం – సేవే మా లక్ష్యం.







ఒకే రోజు ఇద్దరు అనాథలకు చివరి వీడ్కోలు పలికిన ఏం డీ ఆర్ ఫౌండేషన్.పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని రామచంద్రపురం మరియు ఇస్నాపూర్ ప్రాంతాల్లో మరణించిన ఇద్దరు యాచకులకు బంధువులు, ఆప్తులు ఎవరూ లేకపోవడంతో వారి అంత్యక్రియలను ఏం డీ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గౌరవప్రదంగా నిర్వహించడం జరిగింది.

పుట్టినప్పుడు ఎవరైనా స్వాగతం పలుకుతారు.కానీ చివరి ప్రయాణంలో తోడు నిలవడం నిజమైన మానవత్వానికి నిదర్శనం. సమాజం మరచిపోయిన వారికీ గౌరవప్రదమైన వీడ్కోలు అందించడం ప్రతి మనిషి బాధ్యత అనే భావనతో ఏం డీ ఆర్ ఫౌండేషన్ ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టింది.చివరి క్షణాల్లో కూడా మానవీయ విలువలను కాపాడుతూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న ఏం డీ ఆర్ ఫౌండేషన్‌కు స్థానికులు అభినందనలు తెలిపారు.మనిషి మరణించిన తర్వాత కూడా అతని గౌరవాన్ని కాపాడటం మానవత్వంలో అత్యున్నత సేవ.



## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం, సందేశం టైమ్స్ (జూన్ 16), ప్రతినిధి: ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని సత్వరమే పరిష్కరించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను గట్టిగా ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి వారి బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎర్రుపాలెం మండలం మీనవోలు గ్రామ కాంగ్రెస్ ఆర్గనైజర్ సాగుర్తి ఫిలిప్ గ్రామంలోని సర్వే నెంబర్లు 188, 190, 119 లలో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల వారు తమ తాత ముత్తాతల కాలం నుండి వ్యవసాయం చేసుకుంటున్నారని, వీరికి వెంటనే వ్యవసాయ పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, కలెక్టరేట్ ఈ-విభాగం పర్యవేక్షకులకు సదరు అర్జీని పంపుతూ దీనిపై క్షేత్రస్థాయిలో అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఖమ్మం నగరం 32వ వార్డు బొక్కలగడ్డ ప్రాంతానికి చెందిన టి. ఉమారాణి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆ అర్జీని హౌసింగ్ పీడీ (PD Housing) కి బదిలీ చేస్తూ, అర్హతలను పరిశీలించి లబ్ధిదారురాలికి న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు.

## పోసానిపేట్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఘనంగా పాఠ్యపుస్తకాల పంపిణీ







పోసానిపేట్, సందేశం టైమ్స్ (జూన్ 16), అందోల్ మండల ప్రతినిధి: అందోల్ మండలంలోని పోసానిపేట్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్ కోమరి, ఉపాధ్యాయులు ప్రసన్నకుమార్ చారి, మహేశ్‌కుమార్ చారిల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ జి. గోపాల్, ఉపసర్పంచ్ జి. రాములు, వార్డు సభ్యులు వి. వెంకటేశం, సుధాకర్ మధు మరియు ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ జి. రజిత ముఖ్య అతిథులుగా హాజరై తమ చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, విద్యార్థులంతా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకుని విద్యారంగంలో మరింతగా రాణించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అన్ని రకాల వసతులను, నాణ్యమైన విద్యను కల్పిస్తోందని, ఈ సౌకర్యాలను విద్యార్థులు సంపూర్ణంగా వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పుస్తకాలు పంపిణీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యా కమిటీ ప్రతినిధులు మరియు పాఠశాల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్‌ను కలిసిన టీ.ఆర్.పీ నాయకులు: 'రాజ్యాధికార సమరభేరి' మహాసభ విజయవంతానికి సన్నాహాలు



భువనగిరి, సందేశం టైమ్స్ (జూన్ 16), ప్రతినిధి: తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీ.ఆర్.పీ) ఆధ్వర్యంలో జూలై 5వ తేదీన నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" మహాసభను విజయవంతం చేయడానికి పార్టీ నాయకత్వం విస్తృత స్థాయిలో సన్నాహాలు చేపడుతున్న నేపథ్యంలో, భువనగిరి జిల్లా ఎస్పీ ఐపీఎస్ అక్షాంశ్ యాదవ్ గారిని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ గారి నేతృత్వంలో టీ.ఆర్.పీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జూలై 5న జరగబోయే సభ నిర్వహణకు సంబంధించిన ముందస్తు అనుమతులు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు, భద్రతా చర్యలు మరియు సభకు వచ్చే ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన సౌకర్యాలు వంటి పలు కీలక అంశాలపై ఎస్పీ గారితో సవివరంగా చర్చించారు. ఈ మహాసభకు పెద్ద ఎత్తున ప్రజలు, పార్టీ శ్రేణులు హాజరుకానున్నందున, భద్రతా పరంగా తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సభ ప్రాంగణంలో శాంతిభద్రతలు కట్టుదిట్టంగా నిర్వహించాలని నాయకులు ఎస్పీ గారికి విజ్ఞప్తి చేశారు. సభను పూర్తిగా శాంతియుత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ మరియు పరిపాలన యంత్రాంగంతో తమ పార్టీ పూర్తి స్థాయిలో సమన్వయం కొనసాగిస్తుందని ఈ సందర్భంగా పార్టీ నాయకులు స్పష్టం చేశారు. ఎస్పీని కలిసిన వారిలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదేల్ యాదవ్, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ నీరజ గౌడ్, రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీ అనిల్ వీరమల్లు, భువనగిరి జిల్లా అధ్యక్షులు కొమరశెట్టి నరసింహులు, రాష్ట్ర నాయకులు పిట్టల శంకర్, సుతారపు రంగయ్య, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలు షాలిని, ఉపాధ్యక్షురాలు సౌభాగ్య, కార్యదర్శి వనజ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.